
# సారొస్తారా..

- టీయూలో గందరగోళం!
- పత్తాలేని ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్

**కాంగ్రెస్ ప్రభుత్వం** వచ్చినప్పటి నుంచి తెలంగాణ యూనివర్సిటీకి దిశానిర్దేశం చేసే వారు కరువయ్యారు. ఇన్‌చార్జి వీసీ సారథ్యంలోనే వ్యవహారమంతా నడుస్తున్నది. ప్రభుత్వం నియమించిన ఇన్‌చార్జి వీసీ కనీసం చుట్టపు చూపునకైనా ఇటువైపు రావడం లేదు. బాధ్యతలు తీసుకుని ముఖం చాటేస్తున్నారు. దీంతో పరిపాలన గాడి తప్పుతున్నది. ప్రభుత్వంలో పలు శాఖలకు అధిపతులుగా ఉండడంతో సీనియర్ ఐఏఎస్ అధికారులంతా ఇన్‌చార్జి వీసీ పోస్టుకు న్యాయం చేయలేకపోతున్నారు. ఫలితంగా విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నది. గందరగోళంగా మారిన పరిపాలనతో పరిస్థితులు చేయి దాటిపోతున్నాయి. ఏడాదిన్నర కాలంగా శాశ్వత వీసీ లేడు. వీసీల నియామకానికి ప్రభుత్వం చేస్తున్న కసరత్తు సుదీర్ఘంగా కొనసాగుతూనే ఉన్నది. ఓ వైపు శాశ్వత వీసీ నియామకం జరుగక, మరోవైపు ఇన్‌చార్జి వీసీ సందీప్ కుమార్ సుల్తానియా పత్తా లేకపోవడంతో టీయూలో జవాబుదారీతనం కొరవడింది.
–నిజామాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి)





## వీసీ నియామక పరంపరం ఇదీ..

తెలంగాణ యూనివర్సిటీ 2006, జూన్ 18న ఆవిర్భవించింది. మొదట గిరిరాజ్ కళాశాలలో తాత్కాలిక ఏర్పాట్ల మధ్య ఏర్పడి తదనంతరం డిచ్‌పల్లిలోని ప్రస్తుత క్యాంపస్‌కు తరలించారు. ఇక్కడి నుంచి సౌత్ క్యాంపస్ పేరిట కొన్ని విభాగాలను కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లోని జంగంపల్లిలో బీటీఎస్‌కు తరలించారు. తెలంగాణ యూనివర్సిటీ ఆవిర్భావం నుంచి 18 ఏండ్లలో 16 మంది వీసీలు పనిచేస్తే ఇందులో ఏడుగురు ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారులే నియమితులయ్యారు. వీరి ఆధ్వర్యంలోనూ ప్రభుత్వాలు ఆశించిన మేర ఫలితాలు రావడం లేదు. పూర్తిస్థాయిలో ఐఏఎస్ అధికారులు దృష్టి సారించకపోవడంతో పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లుగా టీయూ పరిస్థితి దాపురిస్తున్నది.

| పేరు | బాధ్యతలు | పనిచేసిన కాలం |
|---|---|---|
| ప్రొ.సులేమాన్ సిద్ధిఖి | ఇన్‌చార్జి | మూడు నెలలు |
| ప్రొ.సులోచనారెడ్డి | ఇన్‌చార్జి | నాలుగు నెలలు |
| ప్రొ.కాశీరాం | శాశ్వత వీసీ | 2006–2009 |
| ప్రొ.ఎన్.లింగమూర్తి | ఇన్‌చార్జి | ఏడాది |
| ప్రొ.తిరుపతిరావు | ఇన్‌చార్జి | మూడు నెలలు |
| ప్రొ.వి.గోపాల్‌రెడ్డి | ఇన్‌చార్జి | ఆరు నెలలు |
| ప్రొ.అక్బర్ అలీఖాన్ | శాశ్వత వీసీ | 2011–2014 |
| శైలజా రామయ్యర్(ఐఏఎస్) | ఇన్‌చార్జి | ఆరు నెలలు |
| పార్థసారథి(ఐఏఎస్) | ఇన్‌చార్జి | రెండు సంవత్సరాలు |
| ప్రొ.పి.సాంబయ్య | శాశ్వత వీసీ | 2016–2019 |
| అనిల్‌కుమార్(ఐఏఎస్) | ఇన్‌చార్జి | ఆరు నెలలు |
| నీతూకుమారి ప్రసాద్(ఐఏఎస్) | ఇన్‌చార్జి | ఏడాదిన్నర |
| ప్రొ.రవీందర్ గుప్తా | శాశ్వత వీసీ | 2021–2022 |
| వాకాటి కరుణ (ఐఏఎస్) | ఇన్‌చార్జి | ఏడు నెలలు |
| బుర్రా వెంకటేశం (ఐఏఎస్) | ఇన్‌చార్జి | నాలుగు నెలలు |
| సందీప్‌కుమార్ సుల్తానియా (ఐఏఎస్) | ఇన్‌చార్జి | ప్రస్తుతం కొనసాగుతున్నారు.. |

## పాలకవర్గం ఊసే కరువు..

2024, ఫిబ్రవరిలో తెలంగాణ యూనివర్సిటీ పాలకవర్గం గడువు ముగిసింది. ఈసీ గడువు తీరినప్పటికీ నియామక ప్రక్రియకు అడుగు ముందుకు పడలేదు. విద్యా వ్యవస్థతో సంబంధం కలిగిన వ్యక్తులను ఈసీలో సభ్యులుగా చేర్చుతారు. పాలకవర్గం నియామకానికి తాత్సారం జరుగుతున్నది. ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా, దరఖాస్తులను స్వీకరించకుండానే పేర్లను ఫైనల్ చేస్తున్నట్లుగా తెలుస్తున్నది. విద్యార్హతలు, ఇతరత్రా అనుభవాలు పక్కన పెట్టి అధికార పార్టీ నేతలు సూచిస్తున్న పేర్లను ఖరారు చేస్తున్నట్లుగా తెలుస్తున్నది. తెలంగాణ యూనివర్సిటీకి ప్రస్తుతం సర్వాధికారాలను గుప్పిట్లో పెట్టుకున్న వ్యక్తి చక్రం తిప్పుతున్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈసీ మెంబర్లలో తన వారికి చోటు కల్పిస్తే భవిష్యత్తులో ఏ నిర్ణయానికైనా ఢోకా ఉండదన్న ధీమాలో సదరు కీలక ఆచార్యుడు భావిస్తున్నట్లుగా యూనివర్సిటీ వర్గాలు పేర్కొంటున్నాయి. వీసీ తొలగింపు తర్వాత జరిగిన గందరగోళ వ్యవహారాలన్నీ బయటికి రావొద్దంటే బయటి వ్యక్తులకు స్థానం లేకుండా చేయడమే పరిష్కారం అన్నట్లుగా పావులు కదుపుతున్నట్లుగానూ ప్రచారం జరుగుతున్నది. సర్కారు నుంచి పాలకవర్గం నియామకానికి ఆదేశాలు వచ్చినా గుట్టుగా ఈ వ్యవహారాన్ని కానిస్తుండడంపై సర్వత్రా అనుమానాలకు తావిస్తున్నది. బాలికలు, బాలుర వసతి గృహాల్లో వడ్డించే భోజనంలో పలుమార్లు అపరిశుభ్రమైన ఆహారం వెలుగు చూసింది. ఓసారి బల్లి, మరోసారి పురుగు, బొద్దింకలు రావడంతో విద్యార్థులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. వరుస ఘటనలపై ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం విడ్డూరంగా మారింది.



## తప్పులు మాఫీ..

తెలంగాణ యూనివర్సిటీలో తప్పు చేసేనోళ్లదే రాజ్యం. నిబంధనలు పాటించని వ్యక్తులే రాజ్యమేలుతున్నా.. వారికే వీసీలు, రిజిస్ట్రార్లు వంత పాడుతుండడంతో బోధన, బోధనేతర సిబ్బందిలో క్రమశిక్షణ పూర్తిగా సన్నగిల్లింది. ఉదాహరణకు నెలల తరబడి యూనివర్సిటీకి రాకుండానే జీతాలు తీసుకుంటున్న ఆచార్యుల తీరు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి కొద్దిరోజుల కిందట సౌత్ క్యాంపస్‌లో తనిఖీలు చేపట్టారు. ఒకరిద్దరు ప్రొఫెసర్లు హాజరు కాకపోవడంతో రిజిస్ట్రారే స్వయంగా సీఎల్(క్యాజువల్ లీవ్) పేరిట రిమార్క్స్ రాశారు. సీన్ కట్ చేస్తే సదరు ప్రొఫెసర్ మాత్రం నెలతిరిగే సరికి జీతం కోసం ఎస్టాబ్లిష్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌కు క్లెయిమ్స్ పెట్టుకున్నారు. రిజిస్ట్రార్‌కు ఈ విషయం తెలియడంతో బిల్లును వాపస్ పంపించారు. కానీ సదరు ఆచార్యురాలిపై మాత్రం చర్యలు మాత్రం తీసుకోలేదు. జీతం కోసం ఫైల్ మూవ్‌మెంట్ చేసిన పరిపాలన విభాగం వారిపైనా విచారణ లేదు. ఇది మచ్చుకో ఉదాహరణ మాత్రమే. ఇలాంటి తతంగాలు అనేకం జరుగుతున్నాయి. డిచ్‌పల్లి మెయిన్ క్యాంపస్‌లో ఈ ఏడాది ప్రారంభంలో గంజాయి సరఫరా కేసులో కెమిస్ట్రీ విభాగానికి చెందిన ఆచార్యుడు అరెస్టు కాగా లోతుగా విచారిస్తే నెలల తరబడి యూనివర్సిటీకి రాకున్నా జీతం మాత్రం ఠంఛనుగా పుచ్చుకున్నట్లుగా తేలింది. అక్రమాన్ని సక్రమంగా మలుచుకుంటున్న ఇంటి దొంగలు చాలా మంది ఉండగా వారి తప్పులను మాఫీ చేస్తూ యూనివర్సిటీ పెద్దలే అండదండలు అందిస్తున్నారని


నస్రుల్లాబాద్‌లో స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

## బీఆర్ఎస్ సంబురాలు


రుద్రూర్‌లో పటాకులు కాలుస్తూ..


**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత** జైలు నుంచి విడుదల కావడంపై హర్షం వ్యక్తంచేస్తూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు బుధవారం సంబురాలు నిర్వహించారు. నస్రుల్లాబాద్, రుద్రూర్ మండల కేంద్రాల్లో పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఆలస్యమైనా ధర్మమే గెలిచిందంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రెండు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.
–బాన్సువాడ/రుద్రూర్, ఆగస్టు 28


పిట్లం హెల్త్ సెంటర్ ఎదురుగా తోపుడు బండ్లు పెట్టి నిరసన తెలుపుతున్న కిరణ్

## నిరీక్షించి.. నిరసన

- పిట్లం దవాఖానలో వేళకు రాని వైద్యులు
- ప్రధాన గేటు ఎదుట వాహనాలు అడ్డంపెట్టి రోగుల నిరసన

**వైద్యం కోసం** ప్రభుత్వ దవాఖానకు వచ్చిన రోగులకు నిరీక్షణ తప్పడం లేదు. వైద్యుల కోసం వేచిచూసి విసిగివేసారిన రోగులు, కుటుంబసభ్యులు దవాఖాన ఎదుట నిరసన తెలిపిన ఘటన పిట్లం మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకున్నది. పిట్లం గ్రామానికి చెందిన కిరణ్ కూతురు అవంతిక జ్వరంతో బాధపడుతున్నది. దీంతో ప్రభుత్వ దవాఖానకు ఉదయం తీసుకురాగా అందుబాటులో డాక్టర్లు లేరని తెలిపాడు. డ్యూటీ సమయం దాటినా డాక్టర్లు రాలేదని, ఉన్న సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కిరణ్ దవాఖాన ప్రధాన గేటు ఎదుట తోపుడు బండ్లు పెట్టి నిరసన తెలిపారు.
–బాన్సువాడ(పిట్లం), ఆగస్టు 28



# డెంగ్యూ వణుకు..





- మంచంపడుతున్న తండాలు
- నిజామాబాద్ జిల్లాలో 28రోజుల్లో 269 కేసులు
- కిక్కిరిస్తున్న దవాఖానలు.. ప్రైవేటుకు కాసుల వర్షం

**విష జ్వరాలు** వెంటాడుతున్నాయి. డెంగ్యూ డేంజర్ బెల్స్ మోగిస్తున్నది. సీజనల్ వ్యాధులు ఉమ్మడి జిల్లా ప్రజలను వేధిస్తున్నాయి. వాతావరణ మార్పులు ఒక వైపు.. పారిశుద్ధ్య లోపం మరోవైపు ప్రజలను రోగాలపాలు చేస్తున్నాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా రోగులు దవాఖానలకు పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వ దవాఖానల్లో మందులు, సిబ్బంది కొరత వేధిస్తుండగా... ప్రైవేటు దవాఖానలకు కాసులు కురిపిస్తూ పేదల జేబులకు చిల్లులు పడుతున్నాయి.
– ఖలీల్‌వాడి, ఆగస్టు 28

**ఉమ్మడి** జిల్లాలో డెంగ్యూ వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. కేవలం 28 రోజుల్లోనే జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానల్లో నమోదైన కేసుల చూస్తేనే భయాందోళనలు నెలకొంటున్నాయి. జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి అంటూ జనం దవాఖానలను ఆశ్రయిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకు 415 డెంగీ కేసులు నమోదు కాగా, ఒక్క ఆగస్టు నెలలోనే 269 కేసులు నమోదైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ నెలలో అత్యధికంగా ఇందల్వాయి పీహెచ్‌సీ పరిధిలో 54, ముదక్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలో 50 కేసులు, ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ పురపాలక సంస్థల్లో 165 కేసులు నమోదయ్యాయి. కామారెడ్డి జిల్లా విష జ్వారాలతో అతలాకుతలమవుతున్నది. రామారెడ్డి, సదాశివనగర్, లింగంపేట్, పిట్లం తదితర మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు వైరల్ ఫీవర్‌తో సతమతమవుతున్నారు. గాంధారి మండలంలోని కొన్ని తండా లు మంచంపట్టాయి. సదాశివ నగర్ మండలంలో ఇటీవల విషజ్వరంతో ముగ్గురు మృ తి చెందిన విషయం తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య లోపం ప్రజలను రోగాలపాలు చేస్తున్నది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోయి దో మలు విజృంభిస్తున్నాయి. నెల రోజుల నుంచి ఆయా గ్రామాల్లో ప్రజలు మంచా న పడుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.





## ప్రైవేటుకు కాసుల వర్షం..

విష జ్వరాలు ప్రైవేటు దవాఖానలకు కాసులు కురిపిస్తున్నాయి. జ్వరం, డెంగ్యూ బాధితులతో ప్రైవేటు దవాఖానలు కిటకిటలాడుతున్నాయి. కొన్ని దవాఖానల్లో వైరల్ ఫీవర్‌తో వచ్చిన రోగులకు అవసరం ఉన్నా లేకపోయినా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్నారు. దీంతో రక్తకణాలకు డబ్బులు కట్టలేక రోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు లోనవుతున్నారు.

### వైద్యులను సంప్రదించాలి..



ఇంటి ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలి. లక్షణాలు కనిపిస్తే ఆందోళన చెందకూడదు. వైద్యులను సంప్రదించాలి. సొంత వైద్యం చేసుకోవద్దు. జ్వరం తీవ్రత మేరకు పరీక్షలు చేయించుకోవాలి. వేడి ఆహారం తీసుకోవాలి.
**- డాక్టర్ జలగం తిరుపతిరావు, మెడికల్ కళాశాల ప్రొఫెసర్**

### ఫ్రైడే.. డ్రైడే నిర్వహిస్తున్నాం



ప్రతి శుక్రవా రం గ్రామాల్లో డ్రై డే నిర్వహిస్తు న్నాం. సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఇంటి ఆవరణలో ఉండే పూలతొట్టీలు, డ్రమ్ముల్లోని నీటిని తొలగిస్తున్నాం. మురికి కుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయిస్తున్నాం.
**- డాక్టర్ తుకారాం రాథోడ్, జిల్లా మలేరియా అధికారి**

# ప్రమాదరహిత జిల్లాగా నిలుపుదాం

### జిల్లా జడ్జి సునీత కుంచాల

వినాయక్ నగర్, ఆగస్టు 28: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి నిజామాబాద్‌ను ప్రమాదరహిత జిల్లాగా నిలపాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. జిల్లా పోలీసు శాఖ, న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ సింగేనవార్‌తో కలిసి జిల్లా జడ్జి సునీత ప్రారంభించారు. పరేడ్ మైదానం నుంచి జిల్లా కోర్టు చౌరస్తా వరకు ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించి, అనంతరం హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులకు మూడేండ్ల వరకు జైలు శిక్ష, రూ.25వేల వరకు జరిమానా విధించబడుతుందని తెలిపారు. హెల్మెట్ ధరించి వాహనం నడిపితే ప్రాణాలను కాపాడుకునే ఆస్కారం ఉన్నదని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు వివరించారు. జిల్లాలో గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 337 మంది చనిపోతే, ఈఏడాది ఇప్పటి వరకు 218మంది ప్రాణాలు కోల్పోయారని, అందులో ద్విచక్ర వాహనదారుల సంఖ్యనే అధికంగా ఉన్నదని సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ వెల్లడించారు. అదనపు జిల్లా సెషన్స్ జడ్జీలు కనకదుర్గ, శ్రీనివాస్, ఆశాలత, సీనియర్ సివిల్ జడ్జీలు ఎం.శ్రీకాంత్ బాబు, పి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనం నడుపుతున్న జిల్లా జడ్జి, ఎస్పీ, అధికారులు

# అటవీ భూముల రక్షణకు కదిలిన గౌరారం


అటవీ భూమిలో వేసిన మక్కజొన్న పంటలోకి పశువులను వదిలిన గౌరారం గ్రామస్తులు

గాంధారి, ఆగస్టు 28: కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని గౌరారం గ్రామస్తులు అడవుల సంరక్షణకు కదిలారు. ఆడవులను ఆక్రమించి వేసిన గుడిసెలను ఇటీవలే ధ్వంసం చేసిన స్థానికులు.. తాజాగా అటవీ భూము ల్లో సాగు చేసిన పంటల్లోకి బుధవా రం పశువులను వదిలారు. చెట్లను అక్రమంగా నరికేస్తుండడంతో అడవి కనుమరుగై పోతుందని గ్రహించిన గ్రామస్తులు.. పచ్చదనం పెంపొందించడానికి నడుం బిగించారు. అందులో భాగంగానే బుధవారం అటవీ శాఖ అధికారులతో కలిసి తమ గ్రామ శివారులోని అటవి భూముల్లో ఆక్రమంగా సాగు చేస్తున్న పంటల్లోకి పశువులను వదిలారు. చుట్టు పక్కల తండా వాసులు అత్యాశకు పోయి తమ గ్రామ శివారులోని అటవీ భూముల్లో పంటలను సాగు చేస్తున్నారని, తద్వారా అడవి కనుమరుగై పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అటవీ జంతువులకు ఆవాసాలు లేక ఊర్లల్లోకి వస్తున్నాయన్నారు. అటవీ భూములను ఆక్రమించిన వారిపై కేసులు పెట్టి, కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు అధికారులను కోరారు. భావి తరాలను దృష్టిలో ఉంచుకొని అడువులు అంతరించి పోకుండా కృషి చేస్తున్న గౌరారం గ్రామస్తులను ఇతరులు ఆదర్శంగా తీసుకుని అడవుల పరిరక్షణకు ముందుకు రావాలని ఫారెస్ట్ అధికారులు సూచించారు.

# వ్యాపారిపై దాడి

### చికిత్స పొందుతూ మృతి

కామారెడ్డి,ఆగస్టు 28: పాత కక్షలతో దాడికి పాల్పడగా చికిత్స పొందుతూ వ్యాపారి మృతి చెందిన ఘటన కామారెడ్డిలో చోటు చేసుకున్నది. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి పట్టణంలోని విద్యానగర్ పరిధిలో ఉన్న శివాలయానికి వ్యాపారి పాత విశ్వనాథం(64) మంగళవారం వెళ్లాడు. అదే సమయంలో పాత గొడవలు మనసులో ఉంచుకొని కామారెడ్డికి చెందిన లక్ష్మీబాయి, కొంతమంది కలిసి విశ్వనాథంను అడ్డగించి డబ్బుల విషయమై గొడవపడి పిడిగుద్దుల వర్షం కురిపించి కారులో ఎక్కించుకొని పారిపోయే ప్రయత్నం చేశారు. చుట్టుపక్కల వారు గమనించి నిలువరించే ప్రయత్నం చేయడంతో వారు పారిపోయారు. గాయపడ్డ విశ్వనాథాన్ని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లో ఉన్న యశోదకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకవచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. విశ్వనాథం బావమరిది రాజశేఖర్ ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

# క్రమబద్ధీకరించాలి

### సమగ్రశిక్షా ఉద్యోగుల నిరసన

కామారెడ్డి,ఆగస్టు 28: తమను రెగ్యులరైజ్ చేసి బేసిక్ పే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సమగ్రశిక్షా ఉద్యోగులు బుధవారం నిరసన తెలిపారు. కామారెడ్డిలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన ఉద్యోగులు.. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది వరంగల్‌లో సమ్మె చేస్తున్న తమకు టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ఇప్పటి సీఎం రేవంత్ రెడ్డి తమ ప్రభుత్వం వచ్చిన నెలరోజుల్లోనే రెగ్యులరైజ్ చేస్తామని, బేసిక్ పే అమలు చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా రెగ్యులరైజ్ చేయలేదని అన్నారు. దీక్షకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కామారెడ్డి జిల్లా జేఏసీ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి సంపత్, సభ్యులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులు



దశ దినకర్మ
ఉన్నత లక్ష్యాలతో కూడిన మీ జీవితం ఎందరికో ఆదర్శనీయం. మీరు చూపిన మార్గం అనుస్మరణీయం. మీతో గడిపిన మధుర క్షణాలు మా మదిలో ఎన్నటికి పదిలం. మీరు భౌతికంగా లేరన్న నిజం ఇప్పటికీ నమ్మలేకపోతున్నాము. మీరు లేని లోటు పూడ్చలేనిది. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన.
శోకతప్తహృదయాలతో....
కీ.శే. డాక్టర్ కొట్టూరు ముత్యం
M.A.,M.Phil., Ph.D., LLB.
రిటైర్డ్ ప్రొఫెసర్ (శాతవాహన యూనివర్సిటీ)
జననం:14-04-1958 మరణం: 20-08-2024
కార్యస్థలం : తేది: 29-08-2024 గురువారం ఉదయం 11 గంటలకు గాయత్రినగర్‌లోని మా స్వగృహమునందు జరుగును.
సెల్: 9989709595.
మీ పెద్దన్నయ్య..
కొట్టూరు ధర్మయ్య
(రిటైర్డ్ హెడ్ మాస్టర్)
కుటుంబ సభ్యులు